క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు


రామాంజనేయులు


రావి రాంబాబును అభినందిస్తున్న డీటీ

వీరవాసరం: వీరవాసరం తహసీల్దార్‌గా ఏవీ రామాంజనేయులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజల సమస్యలను తక్షణం స్పందించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానన్నారు. గతంలో ఈయన అత్తిలి తహసీల్దార్‌గా పనిచేస్తూ, ఎన్నికల విధుల్లో భాగంగా కృష్ణా జిల్లా గుడివాడ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. మరలా వీరవాసరం తహసీల్దార్‌గా నియమితులయ్యారు. తహసీల్దారు రామాంజనేయులును మండల ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది అభినందించారు.

భీమవరం అర్బన్: భీమవరంలో నూతన తహసీల్దార్‌గా రావి రాంబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో రావి రాంబాబు కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేసి ఎన్నికల విధుల్లో భాగంగా కృష్ణా జిల్లా పెడనలో తహసీల్దార్‌గా పని చేశారు. బదిలీపై భీమవరం తహసీల్దార్‌గా రాంబాబు వచ్చారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా శివకుమార్ తూర్పుగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన నూతన తహసీల్దార్ రావి రాంబాబుకు డిప్యూటీ తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాయుడు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, నాయకులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

పేద విద్యార్థులకు రగ్గులు, దుప్పట్ల పంపిణీ


చినఅమిరంలో విద్యార్థులకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న పూర్ణచంద్రరావు

భీమవరం అర్బన్: నేటి బాలలే రేపటి పౌరులని ఎవరూ లేని అనాథలను ఆదుకోవడంలోనే ఆనందం ఉంటుందని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బందన పూర్ణచంద్రరావు అన్నారు. భీమవరం మండలంలోని చిన అమిరం గ్రామంలో వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ జన్మదిన వేడుకల సందర్భంగా ఇమ్మానియేలు చిల్డ్రన్ హోమ్‌లో అభిమానులు, నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం దుప్పట్లు, రగ్గులు, పుస్తకాలు పంపిణీ చేశారు. చిల్డ్రన్ హోమ్ నిర్వాహకురాలు అనురాధ, ఎర్నలిస్ట్, ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా స్వాతంత్య్ర పక్షోత్సవాలు


భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్నదృశ్యం

భీమవరం: భారత స్వాతంత్య్ర సంగ్రామంలో మహాత్మాగాంధీ పిలుపు మేరకు పస్తుల సాగరం పోరాటం వెలకట్టలేనిదని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భారత స్వాతంత్య్ర పక్షోత్సవాలను చినరంగని పాలెంలోని పస్తుల సాగరం మున్సిపల్ హైస్కూల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ నాయకుల చిత్రాలు, జాతీయ జెండాలతో ర్యాలీ, పస్తుల సాగరం కుటుంబ సభ్యులకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, హైస్కూల్ ఇన్‌ఛార్జ్ హెచ్ఎం బొక్కా గోపినాథ్, వబిలిశెట్టి రామకృష్ణ, మల్లుల సీతారామ్ ప్రసాద్, పస్తుల హరిప్రసాద్, పస్తుల రఘురామ్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలి


భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్సై రెహమాన్

భీమవరం: భీమవరంలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) స్పష్టం చేశారు. భీమవరం వన్ టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎం నాగరాజు, టూ టౌన్ ఎస్సై రెహమాన్ మంగళవారం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా అంజిబాబును కలిసి సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలో ప్రత్యేకంగా మహిళా రక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ముందుగా సీఐ నాగరాజు, ఎస్సై రెహమాన్ ఎమ్మెల్యే అంజిబాబుకు పూలబొకేలను అందజేశారు.

ప్రజలను పీడిస్తున్న జ్వరాలు

- వణికిస్తున్న సీజనల్ వ్యాధులు
- దగ్గు, జలుబు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ఇక్కట్లు
- రోజురోజుకూ పెరుగుతున్న బాధితుల సంఖ్య


ఆకివీడు: ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు


ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న రోగులు

ఆకివీడు: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వాతావరణంలో వచ్చే మార్పులతో పాటు సీజనల్ వ్యాధులు కాలానుగుణంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఒక సీజన్ నుంచి మరొక సీజన్‌కు వాతావరణం వైరల్ జ్వరాలు, దగ్గు, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, టైఫాయిడ్, మలేరియా, డయేరియా, డెంగీ, చికున్ గున్యా, శ్వాస కోస వ్యాధులు వంటివి విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు జ్వరాలతో ఉన్న రోగులతో కిటకిటలాడుతున్నాయి. వైరల్ ఫీవర్లు అధికంగా ప్రజల్ని పట్టిపీడిస్తున్నాయి. వాతావరణంలో పెనుమార్పులే దీనికి కారణమంటున్నారు. ఉక్కబెట్టే వాతావరణం, చల్లగా మారిపోతున్న తేమ వాతావరణంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. జ్వరాల అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్, సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో ప్రతి రోజూ రెండు మూడు కేసులు జ్వరాలతో ఉన్న రోగులు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ అధిక సంఖ్యలో రోగులు చేరుతున్నారు. జూలై నెలలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో రోజుకొక జ్వర పీడితుడు వచ్చి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆగస్టులో ఐదు రోజులుగా నియోజకవర్గంలో సుమారుగా 135 మంది వైరల్ ఫీవర్‌తో ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో మరో రెండు వందల వరకూ రోగులు వైద్యం పొందారు.

ఇంటింటా సర్వే

సీజనల్ వ్యాధుల్ని అరికట్టేందుకు, జ్వర బాధితుల్ని సకాలంలో రక్షించేందుకు ఇంటింట సర్వే చేస్తున్నారు. ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ఇంటింటా సర్వే చేస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, ఇతర ఇబ్బందులుంటే తెలుసుకుంటున్నారు.

ఇన్‌ఫ్లూయెంజా ఫీవర్

ఇన్‌ఫ్లూయెంజా ఫీవర్ కేసులు ఆకివీడు మండలంలో పెరుగుతున్నాయి. ఐదు రోజుల్లో ఆకివీడు, కోళ్లపర్రు, అజ్జమూరులో శ్వాసకోస ఇబ్బందులతో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి బాధితులు వైద్యం పొందుతున్నారు. మరికొంత మంది ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దగ్గు, జలుబు, ఊపిరి అందకపోవడం, ఆయసం వంటి లక్షణాలతో ఇన్‌ఫ్లూయెంజా ఫీవర్ వ్యాధిగ్రస్తులు ఇబ్బంది పడుతున్నారు. కోవిడ్ లక్షణాలు పోలి ఉండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇది అంటువ్యాధిగా ప్రబలే అవకాశం ఉందంటున్నారు.

జ్వర బాధితుల వివరాలు

మండలం	ఆస్పత్రి	బాధితులు
ఆకివీడు	సీహెచ్‌సీ	70
	పీహెచ్‌సీ	12
	అర్బన్ హెల్త్‌సెంటర్	21
ఉండి	పీహెచ్‌సీ	11
యండగండి	పీహెచ్‌సీ	4
కాళ్ల	పీహెచ్‌సీ	8
పాలకోడేరు	పీహెచ్‌సీ	9
మొత్తం		135

జ్వరాలతో రోగులొస్తున్నారు



వైరల్ జ్వర బాధితులు రోజుకు ఇద్దరు నుంచి ముగ్గురు చికిత్స కోసం ఆస్పత్రికి వస్తున్నాయి. స్థానిక సీహెచ్‌సీలో వైద్యం అందించి అవసరమైన వారిని ఇన్ పేషెంట్‌గా చేర్చుకుని చికిత్స అందిస్తున్నాం. మిగిలిన వారికి మందులు ఇచ్చి పంపించి వేస్తున్నాము. ఐదు రోజులుగా అధిక శాతం మంది వైరల్ జ్వరాలతో వచ్చారు.

–అజ్మీరా నజిరిన్, సూపరింటిండెంట్, సీహెచ్‌సీ, ఆకివీడు

- పారిశుధ్యం మెరుగు పరచుకోవాలి. డ్రెయినేజీలను శుభ్రపరచాలి. నీటి గుంతల్ని తొలగించాలి. నీటి నిల్వలను ఉంచకూడదు.
- దోమల నిర్మూలన చేపట్టాలి.
- మంచినీటి కలుషితం కాకుండా చూసుకోవాలి, టైఫాయిడ్, మలేరియాకు గురయ్యే ప్రమాదం ఉంది.
- వర్షపు నీటి నిల్వలున్న ప్రాంతాల్లో టైగర్ దోమ నిల్వతో డెంగీ వచ్చే ప్రమాదం ఉంది.
- ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి.
- మాస్కు ధరించాలి, జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలి.
- చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- వ్యాధి ప్రబలిన వ్యక్తికి దూరంగా ఉండాలి.
- తుమ్ములు, దగ్గులు వచ్చినప్పుడు జాగ్రత్తలు పాటించాలి.
- బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి. వ్యాధినిరోధక శక్తిని పెంపొందించుకోవాలి.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

పాలకోడేరు: ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా నిత్యావసర వస్తువులు అందించాలని పాలకోడేరు మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నడింపల్లి భారతి విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆమెను మంగళవారం మండలంలోని రేషన్ డీలర్లు మర్యాద పూర్వకంగా కలుసుకుని సత్కరించారు. సీఎస్‌డీ టి శేషయ్య, మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దొంగ కృష్ణ, ప్రధాన కార్యదర్శి సాయి కృష్ణ, కోశాధికారి కొల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు

భీమవరం: భీమవరంలోని వ్యాపారుల వద్ద అధికారులు అక్రమ వసూళ్లకు వస్తే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) మంగళవారం తెలిపారు. వ్యాపారుల వద్ద వివిధ శాఖల అధికారులు అక్రమ వసూళ్ల విషయం తన దృష్టికి వచ్చిందని ఆ విధానాన్ని సహించేది లేదని అన్నారు. అధికారులెవరైనా బెదిరిస్తే వారిని వ్యాపారులు తమ వద్దనే కూర్చోబెట్టుకుని తనకు ఫోన్ చేస్తే తానే అక్కడివచ్చి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

అట్రాసిటీ కేసులో 9 మంది అరెస్ట్

పాలకోడేరు: పాలకోడేరు దాడి ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన 9 మందిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. భీమవరం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్ కొనసాగుతుందని ఆయన తెలిపారు

రెండు మిస్సింగ్ కేసుల నమోదు

కాళ్ల: భర్త కనిపించట్లేదు అంటూ భార్య, కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి ఇచ్చిన ఫిర్యాదులు మేరకు రెండు మిస్సింగ్ కేసులు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొండాడ గ్రామానికి చెందిన జి.మోహనరావు గత నెల 23న మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లి వస్తానని తిరిగి ఇప్పటివరకు ఇంటికి రాకపోవడంతో భార్య మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ బి.వి. ప్రసాద్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఎల్ఎన్ పురం గ్రామానికి చెందిన బి.వీరప్రభ భర్తతో గొడవ పడి సుమారు 6 నెలలుగా తన పుట్టింటి వద్ద తండ్రి దగ్గర ఉంటోంది. గత నెల 31వ తేదీన ఉదయం సమయంలో పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి తన కుమార్తె వీరప్రభ ఇంట్లో కనిపించలేదంటూ తండ్రి పి. తాతారావు పోలీసులను ఆశ్రయించారు. కాళ్ల పోలీస్ స్టేషన్లో తాతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ జె.శ్రీనివాస్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అస్సాం వాసి మృతిపై కేసు నమోదు

ఉండి: మండలంలోని పాములపర్రుకు చెందిన నక్కా వెంకప్ప అనే ఆక్వా రైతు చెరువు వద్ద పని చేస్తున్న అస్సాం రాష్ట్రం సోనిక్‌పూర్ ప్రాంతానికి చెందిన సమాల్ బాసుమతారీ(26) అనే వ్యక్తి, సుమారు 6 నెలల నుంచి పాములపర్రులోని ఆక్వా చెరువు వద్ద పని చేస్తున్నాడు. ఈ నెల 5వ తేదీ రాత్రి 8.30 గంటలకు తాను పనిచేస్తున్న చెరువుగట్టుపై ఉన్న తన గదిలో నుంచి నోట్లో నురగకక్కుతూ బయకు వచ్చాడు. అయితే అదే సమయంలో అక్కడే ఉన్న కఠారి శ్రీను అనే వ్యక్తి ఇది గమనించి చెరువు యజమాని వెంకప్పకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వెంకప్ప వెంటనే చెరువు వద్దకు వచ్చి బాసుమతారీని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. అయితే అప్పటికే అతడు చనిపోవడంతో ఆక్వా రైతు వెంకప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా ఎస్సై యెషయా కేసు నమోదు చేసి అతనితో స్నేహంగా ఉండే సమీప చెరువులపై పనిచేస్తున్న వారి ద్వారా మృతుని కుటుంబీకులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కుటుంబీకులు భీమవరం చేరుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించడంతో వారు స్వస్థలానికి మృతదేహాన్ని తీసుకువెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

నాటక రంగంపై రంగరాజుకు డాక్టరేట్

ఉండి: చెరుకువాడకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గాదిరాజు రంగరాజుకు కర్ణాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించిందని మంగళవారం తెలిపారు.పశ్చిమగోదావరి జిల్లా నాటక రంగ వికాసం అనే అంశంపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించినట్లు ఆయన తెలిపారు. నాటక రంగంపై తాను తయారు చేసిన సిద్ధాంత గ్రంథాన్ని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు పరిశీలించిన అనంతరం యూనివర్సిటీ జూలై నెల 9న పరీక్ష నిర్వహించారని తెలిపారు. యూనివర్సిటీ మంగళవారం తనకు డాక్టరేట్ ప్రకటించిందని తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ మండలాధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి, కార్యదర్శి ముదునూరి శివరామరాజు, మావనతా సేవా సంస్థ మండలాధ్యక్షుడు పెన్మత్స రామకృష్ణంరాజు, చైర్మన్ యువరాజు, కోచైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు, రచయిత పాత్తూరి సీతారామరాజు, కొత్తపల్లి ఉదయబాబు, నటులు గాదిరాజు వెంకటేశ్వరరాజు, ముదునూరి గోపాలకృష్ణంరాజు, మాసాబత్తుల రామకృష్ణారావు, ఈగ్నిహోత్రం ఫణిప్రసాద్ తదితరులు రంగరాజుకు డాక్టరేట్ లభించడంపై హర్షం వ్యక్తం చేసారు.

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం


ఏలూరుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కాళ్ల: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఏలూరుపాడులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల1 నుంచి 7 వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్, ఆధ్వర్యంలో అవగాహన సదస్సు అనంతరం ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ వి.వాణిరత్నం మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యానికి తల్లిపాలు దోహదం చేస్తాయన్నారు. గర్భిణులు డెలివరీ అయిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని సూచించారు.సూపర్‌వైజర్లు పార్వతి, అంగన్వాడీ కార్యకర్తలు ఆర్ లక్ష్మి, ఏపీఎం లక్ష్మి, కాశీరత్నం భవాని ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, బాలింతులు, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని స్వీకరించాలి

వీరవాసరం: మహిళలంతా పౌష్టికాహారాన్ని స్వీకరిస్తూ చక్కటి ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించాలని వీరవాసరం సెక్టార్ సూపర్‌వైజర్ వి.కనక మహాలక్ష్మి తెలిపారు. వీరవాసరం శివారు తలతాడితిప్ప అంగన్‌వాడీ ప్రాంగణంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు కచ్చితంగా తల్లిపాలను అందించాలని, తద్వారా పిల్లల ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల ఉపయోగంపై ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పి.రాగిణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మపాలే బిడ్డకు అమృత తుల్యం

ఏలూరుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అమ్మపాలే బిడ్డకు అమృత తుల్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ అనిల్‌కుమారి అన్నారు. భీమవరం మండలంలోని వెంప, గొల్లవానితిప్ప సెక్టార్లలో మంగళవారం తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్ వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే కోళ్ల పెంపకంలో లాభాలు


కోళ్ల పెంపకంపై మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు జవహర్‌హుస్సేన్

ఉండి: కోళ్ల పెంపకంలో జాగ్రత్తలు పాటిస్తే లాభాలు వాటంతటవే వస్తాయని పశుసంవర్ధకశాఖ భీమవరం ఉపసంచాలకుడు డాక్టర్ జవహర్ హుస్సేన్ అన్నారు.మంగళవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో పెరటి కోళ్ల పెంపకంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జవహర్‌హుస్సేన్, వెంకటరామన్నగూడెం బఫెల్లా రిసెర్చ్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగరాజకుమారి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లికార్జునరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జవహర్‌హుస్సేన్ మాట్లాడుతూ వ్యాపార పరంగా పెంచే కోళ్లు గుడ్లుపెట్టేవి (లేయర్స్), మాసం (బ్రాయిలర్స్) కోళ్ల పెంపకంలో పలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. డాక్టర్ నాగరాజకుమారి మాట్లాడుతూ దేశీయ కోళ్ల పెంపకం కుటీర పరిశ్రమగా నిర్వహించవచ్చని తెలిపారు. కోళ్ల షెడ్లు ఏర్పాటు చేసేటప్పుడు గాలి వెలుతురు సమృద్ధిగా ఉండేలా చూడాలన్నారు. ప్రతి కోడికి ఒకటి రెండు చదరపు అడుగులు విస్తీర్ణం ఉండేట్లు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కోళ్ల దాణా తయారీలో మొక్కజొన్న, సోయా, వేరుశనగ, వరి, తవుడుతో పాటు ఖనిజ లవణాలు, విటమిన్లు కలుపుకుని ఉపయోగించాలని తెలిపారు. కోళ్లకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ దెబోరా మెస్సియానా, డాక్టర్ ఏ శ్రీనివాసరావు, పీ వినయలక్ష్మి, బీ రజిత,బీ రామకృష్ణ, భీమవరం,పాలకోడేరు, నరసాపురం,ఉండి, ఆకివీడు,పెనుమంట్ర,వీరవాసరం, పాలకొల్లు,మొగల్తూరు తదితర మండలాల నుంచి ఔత్సాహికులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్య పరిష్కారానికి చర్యలు


కలవపూడిలో చెత్త సేకరణకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ట్రాక్టర్ ను ప్రారంభిస్తున్న దృశ్యం

కాళ్ల: గ్రామంలో పారిశుధ్య సమస్యను అధిగమించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని కలవపూడి గ్రామానికి చెందిన పలువురు గ్రామ పెద్దలు తెలిపారు. కాళ్ల మండలం కలవపూడి గ్రామ పంచాయతీలో చెత్త సేకరణకు సర్పంచ్ గేదెల జాన్, గ్రామ మంతెన వెంకట శివాజీరాజు, మంతెన పెదనరసింహరాజు ఆర్థిక సహకారంతో ట్రాక్టర్ ఏర్పాటు చేశారు. దాతలు అందించిన ట్రాక్టర్‌ను గ్రామ పెద్దల సమక్షంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత శివాజీరాజు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలనే ఆలోచనతో సుమారు రూ.4 లక్షలతో ట్రాక్టర్ కొనుగోలు చేసి పంచాయతీకి అందించినట్లు తెలిపారు. ఏడాది పాటు ట్రాక్టర్ నిర్వహణ ఖర్చు కూడా తామే భరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దాతలను పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

తగ్గిన గోదావరి ప్రవాహ ఉధృతి

నరసాపురం: వశిష్ట గోదావరి నీటిమట్టం సాధారణ స్థితికి చేరుకుంది. స్థానికంగా ప్రవాహ వేగం తగ్గింది. గోదావరి శాంతించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణ పరిధిలో గోదావరి తీరం వెంబడి పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో ముంపు భయం పూర్తిగా తొలగిపోయింది. మాధవాయిపాలెం రేవులో పంటు రాకపోకలను మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో పునరుద్ధరించారు. దీంతో పెద్ద ఎత్తున గోదావరి జిల్లాల మధ్య ప్రజల రాకపోకలు ప్రారంభమయ్యాయి. వలంధర్ రేవు వద్ద భక్తులు స్నానాలు చేయడానికి అనుమతి ఇచ్చారు. వలంధర్ రేవు నీరు తొలగడంతో బురదమయంగా మారింది.

బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


బాడీ బిల్డింగ్ పోటీల్లో 5వ ర్యాంకు సాధించిన రోహిత్‌వర్మను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: మిస్టర్ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి చింత రోహిత్‌వర్మ 5వ ర్యాంకు సాధించాడు. మంగళవారం రోహిత్‌వర్మను కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించినట్టు ప్రిన్సిపల్ ఎ అనురాధ తెలిపారు. రోహిత్ వర్మ ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీబీఏ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడన్నారు. ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 16వ మిస్టర్ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్‌లో పాలకొల్లుకు చెందిన నేషన్ జిమ్ పర్యవేక్షణలో 165 ప్లస్ సీఎంఎస్ కేటగిరిలో రోహిత్‌వర్మ రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకులో నిలిచినట్లు అనురాధ చెప్పారు. ఈసందర్భంగా రోహిత్‌వర్మను కళాశాల డైరెక్టర్ ఎం శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ మావుళ్ళు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.సురేష్ తదితరులు అభినందించారు.

సమసమాజ స్థాపనకు యువత కృషి చేయాలి

భీమవరం: అసమానతలు లేని అభివృద్ధికి, సమసమాజస్థాపన కోసం యువత, విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలని ఉత్తరాంధ్ర జిల్లాల మాజీ ఎమ్మెల్సీ, డీవైఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకుడు ఎంవీఎస్ శర్మ పిలుపునిచ్చారు. మంగళవారం భీమవరంలోని త్యాగరాజ భవన్‌లో నిర్వహించిన డీవైఎఫ్ఐ జిల్లా యువజనుల ఆత్మీయ సదస్సులో అయన మాట్లాడారు. యువజనులు చైతన్యం, దేశభక్తితో ఆదర్శ సమాజ నిర్మాణానికి మూల స్తంభాలుగా ఉండాలని, పాశ్చాత్య వ్యామోహాన్ని విడనాడి మాతృదేశంపై మమకారంతో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న సభలో మాట్లాడారు. ప్రజానాట్యమండలి కళాకారులు అభ్యుదయ గీతాలతో యువజనులను అలరించారు. సమావేశాలకు అధ్యక్ష వర్గంగా జిల్లా కార్యదర్శి జి ధనుష్, ఉపాధ్యక్షుడు బి.రాంబాబు, పిల్లి చంటిబాబు, తెన్నేటి స్టాలిన్, బి బాలాజీ, పి దుర్గ, ఎ శ్రీదేవి అధ్యక్ష వర్గం వహించగా బి బలరామ్, జేఎస్‌పీ గోపాలన్ పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం బకాయిలు చెల్లించాలి


భీమవరంలో ఇన్‌చార్జ్ జేసీ ఉదయభాస్కరరావు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

భీమవరం: ప్రభుత్వ రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను విడుదల చేసి, నీటి పారుదల వ్యవస్థను ప్రక్షాళన చేయకుంటే రైతాంగానికి మనుగడ ఉండదని భారతీయ జనతా కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం భీమవరంలోని కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్ పి ఉదయభాస్కరరావుకు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా మురుగు, పంట కాలువలను ప్రక్షాళన చేయాలని, కాలువల గేట్లు, లాకులు, సైపన్లు మరమ్మతులు చేయించాలన్నారు. జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు కొల్లి వెంకట్రావు, తిరుమాని వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పులపర్తి నాగరాజు, అడ్డగర్ల గాంధీ పాల్గొన్నారు.